# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-06-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. విశాఖపట్నంలో ఈ నెల 21వ తేదీన అతిపెద్ద యోగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

**2. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇవ్వాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.**

**3. అమరావతిలో 1450 ఎకరాల్లో మౌలిక వసతులు కల్పనకు 1052 కోట్ల రూపాయలతో టెండర్లు పిలిచేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆమోదం తెలిపింది.**

**4. తెలంగాణ ప్రభుత్వం తెలుగు సినిమాలకు ప్రకటించిన గద్దర్ చలనచిత్ర పురస్కారాలను ఈరోజు ప్రధానం చేయనుంది.**

**5. ఆంధ్రప్రదేశ్ లోని చీరాల కుప్పడం చీరలు 'ఒకే జిల్లా – ఒక ఉత్పత్తి'కి ఎంపికైనట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.**

==========================

ఆంధ్రప్రదేశ్ లో ఈ నెల 21 వ తేదీన విశాఖపట్నం ఆర్కే బీచ్ నుంచి భోగాపురం వరకు అతిపెద్ద యోగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. రాష్ట్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, పార్టీ ముఖ్యనాయకులతో ముఖ్యమంత్రి నిన్న శ్రవణ మాధ్యమ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, ఇప్పటి వరకు 2 కోట్ల మంది యోగాంధ్ర కార్యక్రమానికి నమోదు చేసుకున్నారని, ఇందులో పార్టీ నాయకులందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు. అలాగే ఈనెల 23 నుంచి పార్టీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన ప్రతి హామీని ప్రజలకు వివరించాలని దిశానిర్దేశం చేశారు.

---

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విద్యాశాఖ అధికారులతో నిన్న ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ. గురుకులాలలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చి చదువుకొని... ఇళ్లకు వెళ్లేలా డే స్కాలర్లకూ అవకాశం ఇవ్వడంపై అధ్యయనం చేయాలని సూచించారు. విద్యాసంస్థలను హేతుబద్ధీకరించి ప్రతి పాఠశాలలో నిర్దిష్ట సంఖ్యలో విద్యార్థులు ఉండేలా చూడాలన్నారు.

---------------------------

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంపై దర్యాప్తు కొనసాగుతోంది, ఫోరెన్సిక్ నిపుణులు ప్రమాద స్థలాన్ని సందర్శించి క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నారు. సంఘటనా స్థలం నుండి బ్లాక్ బాక్స్‌ను స్వాధీనం చేసుకున్నామని పోలీసు అధికారులు తెలిపారు. కాగా మొదట, గుజరాత్ యాంటీ–టెర్రరిజం స్క్వాడ్ –ఎటిఎస్ సంఘటనా స్థలం నుండి ఒక డిజిటల్ వాయిస్ రికార్డర్‌ను స్వాధీనం చేసుకుంది.

మరోవైపు విమాన ప్రమాదానికి సంబంధించిన ఖచ్చితమైన కారణం ఇంకా తెలియలేదని అధికారులు తెలిపారు.

---------------------------

ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు. రక్తదానం చేసే వారికి కృతజ్ఞతలు తెలియజేయడం, రక్తదానం పట్ల ప్రజలలో అవగాహన పెంపొదించి... ఈ కార్యక్రమాన్ని ఉచితంగా నిర్వహించేలా ప్రోత్సహించడం, రక్తదానం వల్ల శరీరానికి కలిగే మేలును తెలియజేయడం ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. రక్తంలోని గ్రూపులను కనుగొన్న ఆస్ట్రియా, అమెరికా దేశాల పౌరసత్వం కలిగిన జీవ శాస్త్రవేత్త, వైద్యులు కార్ల్ ల్యాండ్ స్టీనర్ జయంతి 1868 జూన్ 14ను రక్తదాతల దినోత్సవంగా నిర్వహించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చిన పిలుపు మేరకు ప్రతిఏటా ఇదే రోజున ఈ కార్యక్రమం జరుగుతోంది. ఈ సంవత్సరం “రక్తాన్ని ఇవ్వండి, ఆశను ఇవ్వండి, కలిసి మనం ప్రాణాలను కాపాడుదాం” అనే ఇతివృత్తంతో ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

---------------------------

ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా అర్హులైన వారందరూ స్వచ్ఛంద రక్త దానం చేయాలని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో రక్తదానం ప్రాముఖ్యతను తెలిపేందుకు ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని అన్నారు. రాష్ట్రంలోని విద్యార్థులు, యువత ఆంధ్రప్రదేశ్ రెడ్ క్రాస్ మొబైల్ యాప్ ద్వారా రక్తదాతలుగా నమోదు చేసుకోవాలని సూచించారు.

కాగా.. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈ ఉదయం 10 గంటల 30 నిమిషాలకు ప్రసారమవుతుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో 1450 ఎకరాల్లో మౌలిక వసతులు కల్పనకు 1052 కోట్ల రూపాయలతో టెండర్లు పిలిచేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ – సీఆర్డీఏ సమావేశం జరిగింది. సమావేశం అనంతరం పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ పాత్రికేయులతో మాట్లాడుతూ, పర్యావరణ హిత రాజధాని నిర్మాణంపై నిపుణులతో సంప్రదించామని చెప్పారు. రాజధాని సీడ్ యాక్సెస్ రోడ్ ను జాతీయ రహదారి– 16తో కలిపేందుకు టెండర్ లు పిలవనున్నామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్.. 32 సెకన్లు

---------------------------

తెలంగాణ ప్రభుత్వం తెలుగు సినిమాలకు ప్రకటించిన గద్దర్ చలనచిత్ర పురస్కారాలను ఈ రోజు ప్రధానం చేయనుంది. హైదరాబాద్‌లో ఈ సాయంత్రం జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు, చలనచిత్ర రంగ ప్రముఖులు పాల్గొననున్నారు. ఇందుకు సంబంధించి తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ అన్ని ఏర్పాట్లు చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన 2014 నుంచి 2023 వరకూ ఉత్తమ చిత్రాలకు..2024 సంవత్సరానికి అన్ని విభాగాలకూ గద్దర్ చలనచిత్ర పురస్కారాలను అందజేయనున్నారు.

---------------------------

తెలంగాణలోని ప్రతి రైతు ఖాతాలో రైతు భరోసా నగదును ఈ నెల 25 లోపు జమ చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలో మంత్రి నిన్న మాట్లాడుతూ, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని అన్నారు. పథకానికి అయ్యే వ్యయంపై ప్రతిపాదనలు సిద్ధం చేశామని మంత్రి తెలుపుతూ,

వాయిస్.. 23 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని చీరాల సిల్క్ చీరకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. 'ఒకే జిల్లా – ఒక ఉత్పత్తి' –2024 కింద చీరాల కుప్పడం చీరలు ఎంపికయ్యాయి. ఈ అవార్డును బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి జూలై 14న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో అందుకోనున్నారు. అవార్డుకు కుప్పడం చీరలు ఎంపికైనట్టు అధికారికంగా సమాచారం అందిందని జిల్లా కలెక్టర్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ అవార్డు రావడంతో జిల్లాలో చేనేత కార్మికులకు మంచి గుర్తింపు వచ్చిందని కలెక్టర్ వెంకట మురళి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన నిధుల విడుదలకు, ప్రాజెక్టుల పురోగతికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని రాజ్యసభ అధ్యయన సందర్శన బృందం చైర్మన్ ఎం. తంబిదొరై తెలిపారు. జాతీయ రహదారులు, పర్యాటక శాఖ, పౌరవిమానయానం, వంటి అంశాలపై నిన్న తిరుపతిలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పలు ప్రాజెక్టులు నిర్మాణం అవుతున్నాయని వీటిలో ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టులు ఉన్నాయని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రస్తుత వాతావరణ పరిస్థితిపై అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎల్.నారాయణ ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్...23 సెకన్లు

మరోవైపు.. నైరుతి రుతుపవనాల ప్రభావంతో తెలంగాణలో ఐదు రోజులపాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. దక్షిణ, పశ్చిమ తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురిస్తాయని.. గంటకు 40–50 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని తెలిపింది.

====================